# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## అమలుకాని హామీలు

**అలవిమాలిన** హామీలతో అందలమెక్కిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయలేక చతికిలపడుతున్నది. అధికారం మీది యావతో ఆ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించారు. ఇప్పుడు వస్తున్నదాని కంటే ఇంకా ఎంతో ఎక్కువే వస్తుందని ఆశచూపారు. ప్రజల దృష్టి మరలించి హస్తలాఘవంతో ఓటును కాజేశారు. అధికారం చేజిక్కించుకున్నారు. చివరకు ఏం జరిగింది? ఆరు నెలలు గడిచినా హామీల అమలు తెమలడం లేదు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల గురించి ఆలోచించి ఇచ్చిన హామీలైతే కొంచెం వెనుకా ముందూ అమలు చేయొచ్చు. కానీ, లెక్కాపత్రం చూసుకోకుండా బులిపించి, బుట్టలో వేసుకునేందుకు ఇచ్చిన హామీలు కదా! ఇరికి ఇగిలిస్తున్న సర్కారు కుంటిసాకులతో దాటవేస్తున్నది. రేపు, మాపు అంటూ ప్రజలను మభ్యపెడుతున్నది.

గత ప్రభుత్వ హయాంలో రెప్ప వాల్చేంతసేపు కూడా కరెంటు పోయేది కాదు. కానీ కాంగ్రెస్ పాలన మొదలైనప్పటి నుంచి రాష్ట్ర రైతాంగానికి కరెంటు కష్టాలు షురూ అయ్యాయి. పంట నష్టాలతో సాగు అగమ్యగోచరంగా మారింది. ఈ పరిస్థితుల్లో పంట పెట్టుబడి సాయమైన రైతుబంధు ఎండమావిలా తయారైంది. రైతు సాగుకు సన్నద్ధమయ్యే సమయంలో అందాల్సిన పెట్టుబడి సాయం పంట కోతలైనా చేతికందడం లేదు. పెంచి ఇస్తామన్న రైతుభరోసాకు అతీగతీ లేదు. కౌలురైతుల సాయం లెక్క ఇంకా తేలనేలేదు. విధివిధానాలే ఖరారు కాలేదు. చర్చలతోనే కాలయాపన జరుగుతున్నది. ఇక నిరుద్యోగుల పరిస్థితి మరీ దారుణం. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు 'ఓటు కొట్టు జాబు పట్టు' అన్నట్టుగా వారిని ఊరించారు. తీరా గెలిచాక ఉసూరుమనిపిస్తున్నారు. గోడ మీద క్యాలెండరు మారుతున్నది కానీ, జాబ్ క్యాలెండర్ మాత్రం గోడ మీదకు రావడం లేదు. పోస్టుల పెంపూ ఉత్తమాటే అయ్యింది. డీఎస్సీలో 'మెగా' చేతివాటం చోటుచేసుకున్నది. గెస్ట్ లెక్చరర్ల పర్మనెంటుకు ఇంకా ముహూర్తం రానేలేదు. గురుకుల కొలువుల భర్తీల కోసం సీఎం ఇంటి ముందు నిరసనలు చేపట్టినా ఫలితం కనిపించడం లేదు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వెనుకకు వెళ్లిపోయింది. పెంచిన పెన్షన్ కోసం పండుటాకులు ధర్నాలకు దిగడం సర్కారుకు సిగ్గుచేటు. పేదింటి ఆడపిల్లల పెండ్లికి ఇచ్చే కల్యాణలక్ష్మి కోసం కోర్టు మెట్లెక్కితే సర్కారు సమాధానం చెప్పుకోవాల్సి వచ్చింది. తులం బంగారం హామీ గుంజెత్తు కూడా అమలు కావడం లేదు. ఇప్పటిదాకా ఉన్నది ఇస్తే చాలు.. అదే పదివేలని జనం అనుకునే పరిస్థితి తెచ్చిపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.

రుణమాఫీ గురించి క్యాబినెట్‌లో చర్చించామన్నారు. ఏం చర్చించారో చెప్పడం లేదు. ఎట్ల అమలు చేస్తరో ఇప్పటివరకూ చెప్పలేకపోయారు. ఆర్టీసీని నడుమన పడేసి ఉచిత బస్సు హామీ, విద్యుత్తు శాఖ మీద బరువు మోపి గృహజ్యోతి హామీని మాత్రమే అమలులోకి తేగలిగింది. 420 హామీలు గాలిమాటలయ్యాయి. రేపుమాపుల సుడిగుండంలో చిక్కుకొని గిరగిరా తిరుగుతున్నాయి. మోసపోయి గోసపడుతున్నమని ప్రజలు గుర్తిస్తున్నారు. ఈ సమస్యల నుంచి దృష్టిని మళ్లించేందుకు ఇదివరకటి ప్రభుత్వం మీద దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకున్నది కాంగ్రెస్ సర్కారు. ఒక వేలుతో నువ్వు అవతలి వైపు చూపితే మిగిలిన నాలుగు వేళ్లు నీ వైపు చూపుతాయనే ఇంగితం మరిచిపోతే ఎలా? ఏమరుపాటున గద్దెనెక్కించిన ప్రజలు సరైన సమయం వస్తే గుణపాఠం చెప్తారని కాంగ్రెస్ పెద్దలు గుర్తిస్తే మంచిది.

# యువలోకంలో కల్లోలం



డాక్టర్ ఆంజనేయ గౌడ్

**ఊరించిన కాంగ్రెస్ పార్టీ కుర్చీలో కూర్చున్నాక ఖాళీ విస్తరాకు ముందేసి మోసం చేస్తున్నది. మరోసారి గద్దెనెక్కిన మోదీ ప్రభుత్వం పరీక్షల్లో పట్టపగలే చుక్కలు చూపిస్తూ హింసిస్తున్నది. దీంతో రాష్ట్రంతో రోదన, కేంద్రంతో వేదన చవిచూస్తున్న నవతరంలో.. నిరాశ నిప్పును రాజేస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే నమ్మిన నిరుద్యోగులను ధర్నా చౌక్‌కు చేర్చింది. అలాగే నరేంద్ర మోదీ ప్రభుత్వం సైతం పట్టాభిషేక పూలమాలల సుగంధాలు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగానే విద్యార్థి లోకాన్ని నడిరోడ్డుపై నిలబెట్టింది. వెరసి రాష్ట్ర, కేంద్రాల్లోని కాంగ్రెస్, కాషాయ సర్కారులు దేశవ్యాప్తంగా యువలోకంలో కల్లోలం కలిగించాయి. ఢిల్లీలో జంతర్ మంతర్, హైదరాబాద్‌లో ఇందిరా పార్క్‌లు ధర్నాల దండలు ధరించి న్యాయం కావాలని నినదిస్తున్నాయి. కోరి చేసుకున్నోడు ఎగిరెగిరి తంతుంటే ఎటుపోవాలో, ఎవరితో చెప్పుకోవాలో ఎరుగని దుఃఖం నవలోకానికొచ్చింది.**

తెలంగాణ రాష్ట్రంలో అపోహల పొగ పెట్టి, అదిగో, అల్లదిగో ఆశల సౌధం అని నవతరాన్ని నిండా భావావేశంలో ముంచి ఓట్లన్నీ మలుపుకొన్నది కాంగ్రెస్ పార్టీ. అధికారంలోకి రాగానే రేవంత్ రెడ్డి సర్కార్ 'లేస్తే మనిషిని కాననే' నానుడిలా నానా హంగామా చేసింది. ఇంకా గమ్మత్తుగా 'కలువలేనంత దూరంలో లేను, చేరుకోనంత దుర్భేద్యం కాను' అనే భారీ ట్యాగ్‌లైన్ డైలాగ్‌ను వినిపించింది. కానీ ఆరు నెలల పాలన ఎంత చెంతకు చేరిందో అందరికీ, మరీ ముఖ్యంగా యువకులకు అర్థమైపోయింది. చూస్తున్నాం కదా... ముఖ్యమంత్రి ఇంటి ముందు మోకాళ్లపై గంటల పాటు కూర్చొని 'ఎక్కడున్నావయ్యా స్వామి, మమ్ముల కరుణించవేమి' అని ప్రాధేయపడాల్సిన దారుణ పరిస్థితి గురుకుల ఉపాధ్యాయ పరీక్షలు రాసిన నిరుద్యోగులకు వచ్చింది. విడుదల చేసిన నోటిఫికేషన్‌లో మిగిలిన ఉద్యోగాలను, తర్వాతి వరుసలోని అర్హులైన వారితో భర్తీ చేయమని అభ్యర్థిస్తున్న వీరి గోడు, వినేవారు లేక అరణ్య రోదనగా మారింది. డైలాగులు, ఢిల్లీ ట్రిప్పులతో తప్ప, ప్రజల మధ్యలో పాదం మోపని ఫ్లైట్ మోడ్ గవర్నమెంట్ తెలంగాణ నిరుద్యోగులకు నరకాన్ని రుచి చూపిస్తున్నది. సీఎం కానరాక, సీఎంవోలో ఎవరున్నారో తెలియక, విద్యాశాఖకు పెద్ద దిక్కు లేక గురుకుల ఉపాధ్యాయ అభ్యర్థులు గుండెలు బాదుకుంటున్నారు. ప్రచారంలో ప్రజా పాలన, అనుభవంలో ప్రజలెరుగని పాలనగా పట్టపగలే చుక్కలు లెక్కబెట్టిస్తున్నది టోపీ పార్టీ ప్రభుత్వం. 'కుమారి ఆంటీ సమస్య కనిపించిన మీకు వందలాది నిరుద్యోగుల కన్నీళ్లెందుకు కనిపించడం లేద'ంటూ గురుకుల ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసిన ఒక నిరుద్యోగ మహిళ ఆవేదనతో సూటిగా సీఎం రేవంత్ రెడ్డి తీరును తూర్పారబట్టింది. ఇలా మూగ, చెవిటి, గుడ్డి గుణాల గవర్నమెంట్ లక్షలాది మంది నిరుద్యోగుల మోచేతికి బెల్లం పెట్టి నాకమని చెప్పి తమాషా చూస్తున్నది.

ఒక్క గురుకులాల ఉపాధ్యాయ అభ్యర్థులే కాదు, గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసిన వేలాదిమంది నిరుద్యోగులు న్యాయం కోసం నలుదిక్కులా నినదిస్తున్నారు. విపక్ష పార్టీగా ఉన్ననాడు అధికారంలోకి వస్తే 1:100 విధానంలో గ్రూప్-1 మెయిన్స్‌కు క్వాలిఫై చేస్తామని ఇచ్చిన హామీని అమలుపరచాలని చేతులు జోడించి వేడుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు కనికరం కలుగడం లేదు. ఇంత న్యాయమైన అభ్యర్థనలను, ఏ ఆర్థిక అదనపు భారం పడని డిమాండ్లను సైతం సానుకూల ధోరణితో పరిష్కరించే మానవీయ వైఖరి కూడా కాంగ్రెస్ పార్టీ పాలకులకు లేకపోవడం ఆవేదన కలిగించే అంశం. దీనికి తోడు గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 నోటిఫికేషన్లలో ఖాళీల సంఖ్యను పెంచాలని నిరుద్యోగ లోకం గొంతెత్తి దిక్కులు పిక్కటిల్లేలా డిమాండ్ చేస్తున్నది. కృష్ణుడికి మేనమామ గండంలా యువతరానికి రేవంత్ రెడ్డి సర్కార్ గండం పట్టుకున్నది. కోటి కలలతో కాంగ్రెస్‌కు పట్టంగట్టిన నవతరానికి, భూ లోకంలో యమలోకం సినిమా చూపిస్తున్నది హస్తం పార్టీ ప్రభుత్వం.




న్యాయమైన, సాధారణ డిమాండ్‌లను సైతం జఠిలపరుస్తూ, యువజనాన్ని ఉద్యమాల వైపు నెడుతున్నారు. జాతరలా మారిన సచివాలయంలో పైరవీకారుల గుంపులకు తప్ప, ఫిర్యాదుదారులకు కుర్చీ ఇచ్చే నాథుడే కరువయ్యాడు. 'విన్నపాలు వినవలే.. వోరి నాయనా.. మా కష్టాలు కనవలే కాంగ్రెసాయన' అంటూ యువకులు భారీగా ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసిన, దాదాపు భర్తీ ప్రక్రియ పూర్తిచేసిన లేదా భర్తీకి ఖాళీలు గుర్తించి సర్వం సిద్ధం చేసిన ఉద్యోగాల భర్తీనే సమస్యల్లోకి నెడుతుంటే.. ఇక ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీ హామీ ఏ దరికి చేరునో నిరుద్యోగులకు అర్థమవ్వదా...? చిన్నతనంలో అమ్మ చందమామను చూపి గోరు ముద్దలు తినిపించేది, కానీ కాంగ్రెస్ పాలకులు చుక్కలు చూపించి నోటి కాడి ముద్దను లాగేశారు.

> లక్షా అరవై వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి, మరో అరవై వేలకు పైగా సర్కార్ కొలువుల రిక్రూట్‌మెంట్ ప్రక్రియను 90 శాతం పూర్తిచేసిన కేసీఆర్ సర్కార్‌పై నిందలేసి, గందరగోళం సృష్టించి, గులాబీ పార్టీకి యువలోకాన్ని ఎడం చేశారు. మరి అధికారంలోకి రాగానే నవతరానికి అందజేస్తామని నమ్మబలికిన వాటిలో ఎన్నింటిని ఇచ్చారు..? కొత్తగా ఏవీ ఇవ్వక ఉక్కు సంకల్పాలను కంటనీరు పెట్టిస్తున్నారు కదా...?

మాయ ఫెస్టో లాంటి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోతో యువ తెలంగాణకు ఈస్ట్ మన్ కలర్స్ చూపించి, తీరా గద్దెనెక్కిన తర్వాత గోదారి చూపెట్టడం ఎంతటి అన్యాయం..? సరూర్‌నగర్ స్టేడియంలో గాంధీల చేతులమీదుగా యూత్ డిక్లరేషన్ విడుదల చేసి, చేతిలో చెయ్యేసి చేసిన బాసలన్నీ గుర్తున్నాయా..? మోసం చేస్తేనే జనం ఆదరిస్తారని ఏనాడో శలవిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి నుంచి వాగ్దానాల అమలును ఆశించడం అవివేకమే. యూత్ డిక్లరేషన్‌లో అరచేతిలో వైకుంఠం చూపి, ముందుంది మంచికాలమని నమ్మించారు. సింహాసనంపై ఆసీనులవ్వగానే ముంచే కాలం అంటే ఎట్లుంటుందో అందరికీ అర్థం చేయిస్తున్నారు. ఎన్ని హామీలు...?, ఎన్నెన్ని వంచనా వలలు..? యువజనులను వ్యామోహంలో ముంచడానికి కాంగ్రెస్ పార్టీ శకుని పాచికలను తలదన్నే మాయోపాయాలన్నిటినీ వాడింది. ఆ ఎత్తుగడలో భాగంగానే నిరుద్యోగులకు తలా ప్రతీనెలా రూ.4,000 అందజేస్తామని నమ్మబలకడమే కాక ఉద్యోగ ఖాళీల భర్తీ తేదీలను సైతం ముందే ప్రకటించింది. రెండు లక్షల ఖాళీల భర్తీ, వర్సిటీలకు నిధులు, విద్యార్థినులకు స్కూటీలు ఇలా ఎన్నో హామీలు ఇచ్చి అధికార పీఠాన్ని అలంకరించింది కాంగ్రెస్ పార్టీ. కానీ, ఆరు నెలలు ముగిసినా ఆ హామీల అమలు దిశగా ఒక్క అడుగూ పడిందే లేదు. 37 మంది కార్పొరేషన్ చైర్మన్ నియామకాల పేర్లు సీఎం కార్యాలయం నుంచి విడుదలై అరవై రోజులు ముగిసినా, సంబంధిత నియామకాల అధికారిక జీవోలే విడుదల చేయలేని అసమర్థత రేవంత్ రెడ్డి సర్కార్‌ది. నామినేటెడ్ పోస్టుల నియామకంలోనే కిందమీద పడుతున్న ప్రభుత్వ పెద్దలు, లక్షలాది ఉద్యోగ నియామకాలను సమర్థవంతంగా భర్తీ చేయగలరని ఎవరైనా నమ్మగలరా..? ప్రతిపక్షంలో ఉండగా పెంచుకున్న 'ప్రశ్నించే చిలుకలు' కొన్ని రేవంత్ పంజరంలోనే సేదతీరుతూ, కుర్చీ కలలు కంటున్నాయి. నిరుద్యోగుల కోసమే తమ పోరాటమని ప్రగల్భాలు పలికిన కొందరు కుహనా మేధావులకు ధర్నాచౌక్‌లోని నినాదాలు వినపడటమే లేదు. వెరసి కూసే గాడిదలొచ్చి, మేసే ఆవు దూడలను చెడగొట్టినట్లుగా తెలంగాణ యువతతో కొందరు చెలగాటమాడారు. దీని ఫలితంగా నేడు ఒకవైపు కొలువుల కోసం కొట్లాట జరుగుతుండగా.. మరోవైపు ప్రైవేట్ కంపెనీలూ పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం కూడా అమరావతిపై ఆశపడుతూ, అటువైపే అడుగులు వేస్తున్నది. మొత్తంగా రేవంత్ రెడ్డి సర్కార్‌తో 'న ఘర్కా న ఘాట్కా' అన్నట్లయింది. ఏడాదిలోపే యువతరం గుండెలపై తన్నిన ఘన చరిత్రను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లిఖించుకున్నది. తండ్లాడుతున్న తెలంగాణ నవతరానికి నీడగా నిలబడే నాథుడే సర్కార్‌లో కరువైపోయాడు. ఇప్పుడు కాంగ్రెస్ చేతిలో నమ్మక ద్రోహానికి గురై, తిరగబడిన యువ తెలంగాణ ఉద్యమిస్తున్నది. బీఆర్ఎస్ పార్టీతో పాటు బుద్ధిజీవులందరూ మండుతున్న నవలోకానికి అండగా నిలబడితీరుతారు.

> తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఇలా యువతరాన్ని నిప్పుల కుంపటిలోకి తోసేస్తే, జాతీయ స్థాయిలో మోదీ సర్కార్ సైతం లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాల ఆకాంక్షలకు అగ్గి పెట్టింది.

23 లక్షల మంది నీట్ విద్యార్థులు, 9 లక్షల మంది నెట్ విద్యార్థులతో పాటు వారి కుటుంబాలు సైతం రోడ్లపైకొచ్చి న్యాయం కోసం పోరాడుతున్నాయి. అగ్నిపథ్‌కు మించిన అవలక్షణం జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో బయటపడటంతో యావత్ దేశం ఉలిక్కిపడింది. మోదీ సర్కార్ ఘనంగా మొదలుపెట్టిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ.. విద్యార్థులు, యువకుల పాలిట నేషనల్ ట్రబులింగ్ ఏజెన్సీగా మారి వారి జీవితాలతో ఆటలాడుతున్నది. 'మన్ కీ బాత్' ప్రోగ్రాంలో చివరికి పరీక్షల మెలకువలనూ బోధిస్తూ, ప్రధాని ప్రచారానికి కాదేదీ అనర్హం అని చాటిచెప్పిన నరేంద్ర మోదీకి నీట్, నెట్ ఉదంతాలపై మాట్లాడేందుకు తీరికలేకుండా పోయింది. పోనీ, సౌండ్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ పట్టా పొందిన సంజయ్, అరవింద్, రఘునందన్ లాంటి కమలం పార్టీ నేతలైన రాష్ట్ర, జాతీయ స్థాయిలో యువకుల కష్టాలపై నోరారేసుకుంటారనుకుంటే, వారి గొంతులో కూడా భాస్వరం కాస్తా పాయసమై పోయింది. అంతిమంగా నమ్మితిరా సిద్ధా అంటే గుద్దితిరా సిద్ధా అన్నట్టుగా.. వెన్నుపోటుకు గురైన యువత రాష్ట్రంతో పాటు దేశమంతటా పోరు దారిలో హోరై పోయారు. యువలోకంలో రగిలిన ఈ కల్లోలం ఆగనే ఆగదు. రేవంత్ రెడ్డి సర్కార్ హామీలను అమలుచేయనేలేదు, నవతరం ఆగ్రహ జ్వాలలను తప్పించుకోనూలేదు. మోదీ, రేవంత్ సర్కార్‌ల ప్రయాణం పాతాళంలోకి వేగంగా సాగిపోతుంది. ఈ రెండు సర్కార్ల అంతిమ గమ్యం ఊహించజాలనిదేం కాదు గదా...?

**(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)**

# మోదీకి గ్యారెంటీ ఉందా?



బుద్ధా మురళి

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒక ఆసక్తికరమైన చర్చను లేవనెత్తారు. అదేమిటంటే.. 'బీజేపీ నియమం ప్రకారం 75 ఏండ్లు దాటిన వారికి ఎలాంటి బాధ్యత అప్పగించరు. 2024 ఎన్నికల్లో మోదీ తిరిగి అధికారంలోకి వస్తే ఏడాదిన్నర తర్వాత 75 ఏండ్లకు చేరుకుంటారు. పార్టీ నిబంధనల ప్రకారం మోదీని తప్పిస్తారు కదా! మరి మోదీ గ్యారెంటీ అని ఎన్నికల్లో ప్రధాని మోదీ ఇస్తున్న గ్యారెంటీలకు ఏడాదిన్నర తర్వాత ఎవరు గ్యారెంటీ?' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. అలాంటి నిబంధన ఏదీ లేదని బీజేపీ నాయకులు తప్పించుకున్నప్పటికీ.. '75 ఏండ్లు దాటినవారికి బాధ్యతలు అప్పగించం' అని అంతకుముందు అమిత్ షా ప్రకటించిన వీడియోను ఆప్ ప్రచారంలోకి తీసుకువచ్చింది.

బీజేపీ 240 సీట్లకే పరిమితం కావడంతో రాజ్యాంగం బతికిపోయింది కానీ, ఎన్నికల ప్రచారంలో మోదీ, మీడియా చెప్పినట్టు ఒకవేళ 400 సీట్లు కనుక దాటి ఉంటే.. విపక్షం భయపడినట్టు రాజ్యాంగం కూడా ప్రమాదంలో పడేది. ఒకవేళ 75 ఏండ్ల నిబంధన ఆ పార్టీలో ఉన్నప్పటికీ రాజ్యాంగాన్నే ప్రమాదంలో పడేయగల వారికి దాన్ని తుంగలో తొక్కడం పెద్ద కష్టమేమీ కాదు. 75 ఏండ్ల నిబంధన ఎలా ఉన్నా.. వచ్చే ఎన్నికలకు మోదీ, అమిత్ షా ముఖాలతోనే బీజేపీ పోరాడుతుందా? కొత్త ద్వయం వస్తుందా? అనే చర్చ అయితే రాజకీయ వర్గాల్లో సాగుతున్నది. ఎంత గొప్ప నాయకుడైనా కావచ్చు, ఎంత చరిష్మా అయినా ఉండవచ్చు. కాలం ప్రజల్లో మార్పు తీసుకువస్తుంది. రెండు సార్లు బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చిన మోదీ చరిష్మా ఎంత ఎత్తుకు ఎదగాలో అంత ఎదిగింది. ఇప్పుడు కిందకు పడుతోంది. ఇక కిందకు దిగడమే తప్ప పైకి వెళ్లే అవకాశం లేదు. కొండలాంటి 303కు చేరుకున్న తర్వాత ఇప్పుడు 240కి పడిపోయింది. 2029లో ఇంకా కిందకు దిగడమే తప్ప పైకి వెళ్లడం ఉండదు. అదే సమయంలో కాంగ్రెస్ 2019 కంటే ఇప్పుడు రెట్టింపు మెట్లు ఎక్కింది. వచ్చే ఎన్నికలకు దేశంలో ఎంతో కొంత బీజేపీ కిందకు దిగడం, కాంగ్రెస్ పైకి ఎదిగే అవకాశాలున్నాయి. మోదీ రెండోసారి గెలిచిన తర్వాత బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ సైతం తప్పులను ఎత్తి చూపలేని పరిస్థితి. మోదీ చివరికి తనను తాను దైవంగా భావించారు. తల్లి గర్భంలో అందరి మాదిరిగా జన్మించలేదు, ఏదో సాధించడానికి మానవ జన్మ ఎత్తినట్టు చెప్పుకొన్నారు.


> **ఎన్టీఆర్ తనను తాను దైవాంశ సంభూతునిగా భావించేవారు. తన కాళ్లు పట్టుకొని మొక్కిన వాళ్లే బాబు నాయకత్వంలో 1995 వెన్నుపోటులో తనను అధికారం నుంచి దించేయడంతో కుమిలిపోయిన ఎన్టీఆర్‌కు తాను మానవ మాత్రుడినేనని అర్థమైంది. సరిగ్గా మోదీకి సైతం తాను తీవ్రంగా దుయ్యబట్టిన చంద్రబాబు, నితీశ్ కుమార్‌ల మద్దతుతో ప్రధాని పదవి చేపట్టవలసి రావడంతో తానేమీ దైవాన్ని కాదని, తానూ మనిషినేనని అర్థమైంది.**

18వ లోక్‌సభ ప్రారంభ సమావేశాల్లో ప్రధాని మోదీ ఐదు దశాబ్దాల కిందట ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నిజానికి మోదీ పదేండ్ల పాలనలో అంతకుమించిన అప్రజాస్వామిక చర్యలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేశారు. ప్రత్యర్థులపై ఈడీతో దాడులు చేయించడం, దాడులకు లొంగిపోయి పార్టీలో చేరితే స్వచ్ఛ భారత్, లొంగకపోతే జైలుపాలు చేయడం షరా మామూలైపోయింది. ఇవి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలు కాక కీర్తి కిరీటాలా?



నోట్లను రాత్రికి రాత్రే రద్దుచేసి కోట్లాది మంది ప్రజలను రోడ్డు పాలు చేయడం, ఎంతోమంది మరణానికి కారణం కావడం ప్రజాస్వామ్యానికి మచ్చనా? విజయమా? ఇందిరాగాంధీ ఎమర్జెన్సీలో మీడియాపై ఆంక్షలు విధించారు. మోదీ హయాంలో మీడియాను కొనేశారు. ఎన్డీటీవీ తనను వ్యతిరేకిస్తోందని అదానీతో ఆ ఛానల్‌నే కొనిపించారు. ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమే, మరి వ్యతిరేకంగా రాస్తున్నారని ఛానల్‌నే కొనేసి దొడ్లో కట్టేసుకోవడం ప్రజాస్వామికమా? ధృవ్‌రాఠీ అని ఒక యూ ట్యూబర్ ఉత్తరాదిలో సృష్టించిన తుఫాన్ మామూలుగా లేదు. ఎగ్జిట్‌పోల్‌లో ప్రధాన మీడియా మొత్తం బీజేపీకి 400కు పైగా సీట్లు ఇవ్వగా.. ధృవ్ రాఠీ లాంటి యూట్యూబర్స్ జనాభిప్రాయాన్ని ఎంతోకొంత ప్రపంచానికి తెలిపారు. మీడియాను తమ వారితో కొనిపించి గొంతు నొక్కడం అప్రజాస్వామికం కాదా? 240 సీట్లతో బ్రేక్ పడి ప్రజాస్వామ్యం బతికిపోయింది. కానీ, మీడియా చెప్పినట్టు 400 సీట్లు వచ్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది.

240 సీట్లకు బీజేపీ పరిమితం కావడంతో 2029 ఎన్నికలకు ఆ పార్టీ ఎవరి ముఖచిత్రంతో వెళ్తుందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతున్నది. ఆర్ఎస్ఎస్ సైతం బీజేపీకి కొత్త ముఖం కావాలని పట్టుబట్టే అవకాశం ఉన్నది. ఏ పార్టీ అయినా అధికారంలోకి రావాలని కోరుకుంటుంది. అధికారంలోకి రావడానికి మోదీ కంటే మెరుగైన ఛాయిస్ కోసం బీజేపీ, దాని మాతృ సంస్థ ఆలోచించడం సహజం. వచ్చే ఎన్నికలకు చాలా సమయం ఉందనిపించవచ్చు. అధికార పక్షమైనా, విపక్షమైనా తమకు ప్రజలు ముఖ్యం, వచ్చే ఎన్నికలు కాదని పైకి చెప్పవచ్చు. కానీ, ప్రతి రాజకీయ పక్షం, రాజకీయ నాయకుడు నిరంతరం ఆలోచించేది, వ్యూహాలు పన్నేది, పనిచేసేది రాబోయే ఎన్నికల కోసమే. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతున్నాయి. మోదీకి ప్రత్యామ్నాయంగా నితిన్ గడ్కరీ పేరు బాగా ప్రచారంలోకి వస్తున్నది. ఆర్ఎస్ఎస్ మనిషి, మచ్చలేని నాయకునిగా ఆయనకు పేరున్నది. జాతీయ రహదారుల నిర్మాణం ద్వారా దేశంలో గడ్కరీ మంచిపేరు సంపాదించుకున్నారు. 240 సీట్ల కంటే కిందకు దిగడం కన్నా మోదీకి బదులు గడ్కరీ లేదా మరో నాయకుని నాయకత్వంలో మెజారిటీ సాధించే ప్రయత్నం చేద్దామనే ఆలోచన బీజేపీకీ రావచ్చు. వచ్చే ఎన్నికల కోసమే నిరంతరం పనిచేసినా.. నాయకుడు ఎవరనేది ఇప్పుడే తేల్చక పోవచ్చు. ఎన్నికలకు ఏడాది ముందు కొత్త ముఖంతో బీజేపీ ఎన్నికలను ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు.




## విచారణ లేకుండానే జైలుకు!

*బ్రిటిష్ పాలనలో ఎలాంటి విచారణ లేకుండానే అమాయకులను జైల్లో వేయడం నా చిన్నప్పుడు చూశాను. భారత్ దీని నుంచి విముక్తి పొందుతుందని ఆశించాను. కానీ, అలా జరగలేదు. అందుకు కాంగ్రెస్‌ను నిందించాలి. కాంగ్రెస్ వాటిని కొనసాగిస్తే.. బీజేపీ మరింత విజృంభిస్తున్నది.*



**- అమర్త్యసేన్,** నోబెల్ పురస్కార గ్రహీత

నేడు పీవీ జయంతి



# మా బాపు యాదిలో..

**'శత వసంత శక పురుషుడు మా బాపు'..** వేల ఏండ్ల చరిత్ర కలిగిన ఈ సువిశాల భారతావనికి గుండె వంటి సర్వోన్నత అధికార పీఠమైన ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించిన తొలి తెలుగు, దక్షిణాది నాయకుడు తెలుగు తేజం పాములపర్తి వేంకట నరసింహారావు గారు. రాజనీతికి పవిత్ర భాష్యం చెప్పిన విశిష్ట వ్యక్తి మా బాపు. జాతి, మత, కుల, వర్గ, ప్రాంతాతీతమైన విశ్వజనీన దృక్పథం వారిది.

**'ఆ నిద్రాణ నిశీథిని మానిసి మేల్కాంచినాడు ఒళ్లు విరిచి కళ్లు తెరిచి ఓహో అని లేచినాడు'** అంటూ స్వాతంత్య్ర ఉషోదయానికి కవితాత్మకమైన నివాళి అర్పించినవారు మన పీవీ.. తెలంగాణ ఠీవి.

> **ప్రత్యర్థులను సైతం ఆకర్షించగలిగే బహుముఖ విలక్షణమైన వ్యక్తిత్వం వారిది. బహుభాషా కోవిదుడు. అయినా.. అవసరానికి మించి ఒక్క పదం ఎక్కువ మాట్లాడని మితభాషి. అనేక చిక్కుల్లో ఉన్న దేశాన్ని తొణక్కుండా, బెణక్కుండా గట్టెక్కించిన 'ఆదర్శ' ప్రధాని మా బాపు పీవీ.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో విద్య, వైద్య, న్యాయ, దేవాదాయ, ధర్మాదాయ శాఖల మంత్రిగా ఆయా శాఖలలో తనదైన చెరగని ముద్రవేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిని అలంకరించి భూ సంస్కరణల ముఖ్యమంత్రిగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని అమలుపరిచారు. జాతీయ స్థాయిలో హోం, విదేశాంగ, రక్షణ వంటి అత్యంత కీలక శాఖల మంత్రిగా దేశానికి సేవలందించారు. 'మానవ వనరుల అభివృద్ధి' పేరిట సరికొత్త శాఖకు రూపకల్పన చేసి, అత్యంత ప్రాముఖ్యం కలిగిన శాఖగా దాన్ని నిలిపారు. భారతీయ మేధోసంపత్తిపై అపార విశ్వాసం కలిగిన పీవీ.. అపర చాణక్యుడిగా ప్రపంచ స్థాయిలో రాజనీతిజ్ఞుడిగా ప్రసిద్ధి చెందారు.

రాజకీయ ఒత్తిళ్లు, మతతత్వం, ఉగ్రవాదం వంటి ఎన్నో జఠిల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేండ్లు పూర్తి కాలం నడిపి, భారత దేశ కీర్తిప్రతిష్ఠలను ప్రపంచ వేదికలపై వెలిగించారు. అంతేకాకుండా మరో పదేండ్లు కాంగ్రెస్ పరిపాలన కోసం తన అనుంగు శిష్యుడు అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ గారిని ఈ దేశానికి ప్రధానిగా అందించిన అపర బృహస్పతి మా బాపు. జీవితమే ఉద్యమంగా జీవితయాత్ర సాగించిన మా బాపు పీవీ గారి యాదిలో 104వ జయంతి సందర్భంగా నా శత కోటి నమస్కారాలు.

**- సురభి వాణీదేవి,**
**రాష్ట్ర శాసనమండలి సభ్యురాలు**